




# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190








ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :190 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ సోమవారం- 10 - ఆగస్టు - 2026


## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన!



- నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను పిలవొద్దని విద్యార్థుల డిమాండ్
- దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ అందజేశారు
- నీట్ నిరసనలపై సీజేఐ చేసిన వ్యాఖ్యలే అభ్యంతరాలకు కారణంగా వెల్లడి
- ఇటీవలే ముంబై టిస్‌లోనూ ఇదే తరహా నిరసనలతో స్నాతకోత్సవం వాయిదా
- డిమాండ్ నెరవేరకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని విద్యార్థుల హెచ్చరిక

# ట్రంప్‌కు ఝలకిచ్చిన బెంజిమిన్ నెతన్యాహు

- యుద్ధానికి ముగింపు పలకడానికి ట్రంప్ గాజా శాంతి ఫార్ములా రూపొందించారు.
- ఇజ్రాయెల్ బలగాలు గాజా నుండి క్రమంగా తమ దళాలను ఉపసంహరించుకోవాలి.



ఢిల్లి : ఈ ప్రతిపాదనను ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని తెలిపారు. హమాస్ పూర్తిగా నిరాయుధులయ్యే వరకు గాజా నుంచి వైదొలగబోలేదని నెతన్యాహు తేల్చిచెప్పారు ఇజ్రాయెల్- హమాస్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు, ముఖ్యంగా ప్రస్తుత యుద్ధానికి ముగింపు పలకడానికి ట్రంప్ గాజా శాంతి ఫార్ములా రూపొందించారు. దీని ప్రకారం గాజాలో తక్షణమే కాల్పుల విరమణ అమలు చేసి, హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలను ,ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న పాలస్తీనా ఖైదీలను పరస్పరం విడుదల చేయాలి. అదే విధంగా ఇజ్రాయెల్ బలగాలు గాజా నుండి క్రమంగా తమ దళాలను ఉపసంహరించుకోవాలి. ఈ ఒప్పందానికి ఇజ్రాయెల్ తొలుత అంగీకారం తెలిపింది. అమెరికా అధ్యక్షుడి మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చల తర్వాత, ఇజ్రాయెల్ ఈ శాంతి ప్రణాళికలోని మొదటి దశ ఒప్పందంపై సంతకం చేసింది. మిగతా..2లో

## పోలీసుల ఎదుటే అసాంఘిక శక్తుల దాడి

# నా ప్రాణాలే పోయేవి‘- బీజేపీపై మమత ఫైర్

- మమత బెనర్జీ వాహనంపై రాళ్లు, బురదతో దాడి
- పోలీసుల ఎదురుగానే దాడి జరిగిందని బంగాల్ మాజీ సీఎం ఆగ్రహం



ఢిల్లి : బంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఆదివారం చేదు అనుభవం ఎదురైంది. ఉత్తర 24 పరగణా జిల్లాలో ఆమె కారుపై నిరసనకారులు రాళ్లు, బురద విసరడంతోపాటు, చోర్ (దొంగ), దొంగల రాణి అంటూ నినాదాలు చేశారు. ఈ ఘటనపై మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. "నా కారుపై రాళ్లు, చెప్పులు, ఇటుకలు, బురదతో దాడి చేశారు. ఇది ఒక కుట్ర. నేను వస్తున్నట్లు పోలీసులకు ముందే సమాచారం ఇచ్చాను. అయినప్పటికీ వాళ్లు ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. మొత్తం బంగాల్ ను దుండగులే శాసిస్తున్నారు. పోలీసుల కళ్ల ముందే అసాంఘిక శక్తులు, వ్యక్తులు నా కారుపై పెద్ద రాళ్లు విరిరారు. ఆ దాడి ఎంత తీవ్రంగా జరిగిందంటే, ఒక వేళ కిటికీలు తెరిచి ఉంటే, నా తల పగిలిపోయేది. మేమందరం మిగతా..2లో

## పెద్ది సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకొని భావోద్వేగానికి గురైన కేసీఆర్ రూ.2.25 కోట్ల సాయం అందజేత



- వరంగల్ జిల్లా నల్లబెల్లికి వెళ్లిన బీఆర్ఎస్ అధినేత
- పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్
- జోహార్ పెద్ది సుదర్శన్ రెడ్డి, జై కేసీఆర్ అంటూ కార్యకర్తల నినాదాలు

ఢిల్లి : ఇటీవల మరణించిన బీఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. సుదర్శన్ రెడ్డి స్వగ్రామం వరంగల్ జిల్లా నల్లబెల్లికి వెళ్లిన కేసీఆర్ , దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. సుదర్శన్‌రెడ్డి ఇంట్లో 40 నిమిషాల పాటు గడిపారు. సుదర్శన్‌రెడ్డి మరణంపై ఆవేదన వ్యక్తం

## కుమురం భీమ్ ఆశయాల సాధనకు

# అందరూ ఐక్యంగా కృషి చేయాలి

- కుమురం భీమ్ ఆశయాల సాధనకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు.
- బ్రిటీష్ కాలంలో పోరాడినటు వంటి కుమురం భీమ్ వరకు ఎంతో స్ఫూర్తి పొందామని చెప్పుకొచ్చారు.
- ఎవరికీ తాము వ్యతిరేకం కాదని, ఎవరిని ఈ జాతి వ్యతిరేకించలేదని, ఎవరు వచ్చినా అక్కున చేర్చుకున్నామని వెల్లడించారు.



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 9: కుమురం భీమ్ ఆశయాల సాధనకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు. ఈరోజు(ఆదివారం) అశ్వారావుపేటలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, పాల్గొన్నారు. స్థానిక కూడలిలో కుమురం భీమ్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. మన జాతి ఔన్నత్యాన్ని, జాతి కీర్తిని మన హక్కులను కాపాడినటువంటి మహనీయుడి విగ్రహావిష్కరణ చేయడం సంతోషకరమని తెలిపారు. మన చరిత్ర పోరాటాల చరిత్ర అని మంత్రి సీతక్క అభివర్ణించారు. అడవిలో మన పూర్వీకులు జీవనం మొదలుపెట్టిన నాటినుంచి చెట్టుతో, పుట్టతో, వానలతో, వరదలతో, జంతువులతో పోరాడుతూ ఇక్కడి దాకా వచ్చామని వివరించారు. మరి పోరాటాల చరిత్రలో కాకతీయులకు వ్యతిరేకంగా పోరాడిన సమ్మక్క-సారలమ్మ నుంచి బ్రిటిష్ కాలంలో మిగతా..2లో

## చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం



- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.
- ప్రతి ఏటా బోనాల ఉత్సవాలకు ఎవరూ ఊహించలేనంత నిధులను ఖర్చు చేసి అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రతి ఏటా బోనాల ఉత్సవాలకు ఎవరూ ఊహించలేనంత నిధులను ఖర్చు చేసి అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. లాల్ దర్వాజ సింహవాహిని బోనాల

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల భారీ రద్దీ



- తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ.. ఆక్టోపస్ బిల్డింగ్ వరకు క్యూలైన్లు
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి బయటకు చేరిన క్యూలైన్లు
- గోగర్భం డ్యామ్ సర్కిల్ వద్ద ఆక్టోపస్ భవనం వరకు బారులు
- సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల నిరీక్షణ
- ఒక్కరోజే రూ.4.13 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

తిరుపతి : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయటకు విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు మిగతా..2లో

# కోల్‌కతాలో తప్పిన భారీ ప్రమాదం.. లేజర్ లైట్ల ఎఫెక్ట్.. గాల్లోనే విమానం చక్కర్లు..!



- మలేషియా ఎయిర్‌లైన్స్ విమానానికి తప్పిన ప్రమాదం
- 159 మందితో వస్తున్న విమానంపై లేజర్ లైటింగ్ ఎఫెక్ట్
- లేజర్ లైటింగ్ కారణంగా ల్యాండింగ్ ఆలస్యం, గాల్లోనే చక్కర్లు

ఢిల్లి : కోల్‌కతా విమానాశ్రయంలో మలేషియా ఎయిర్‌లైన్స్ విమానం ల్యాండింగ్ అయ్యే సమయంలో అంతరాయం ఏర్పడింది. కాక్‌పిట్ వైపు లేజర్ లైటింగ్ పడటంతో విమానం గాల్లోనే చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. కౌలాలంపూర్ నుంచి 159 మందితో వస్తున్న మలేషియా ఎయిర్‌లైన్స్ విమానం వీఎ-184 శనివారం రాత్రి నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ కావాల్సి ఉంది. విమానాశ్రయ వర్గాల ప్రకారం.. కాక్‌పిట్ వైపు లేజర్ లైటింగ్ వల్ల పైలట్ దృష్టి మరలింది. వాస్తవానికి, శనివారం రాత్రి 11:20 గంటలకు విమానం ల్యాండ్ కావాల్సి ఉంది. మిగతా..2లో

## ప్రియాంక ఘటనపై అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష.. కఠిన చర్యలకు ఆదేశం



- విశాఖపట్నంలో వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది.
- ఈ ఘటనపై మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి అనిత.. అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నారు.
- ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు స్పందించి, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు హోం మంత్రి అనిత తెలిపారు.

## గిరిజన బిడ్డలు అడవిని అమ్మగా ఆరాధిస్తారు

# అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేస్తారు


- విజయవాడలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు
- కొమ్ము, బంజారా నృత్యాలతో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం
- ఉత్సాహంగా డప్పు కొట్టి, గిరిజన బాలికలతో కలిసి నృత్యం చేసిన సీఎం



2లో..

అమరావతి : అడవిని అమ్మగా ఆరాధించే గిరిజన బిడ్డలకు సరైన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతాలు చేయగలరని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివాసీలు ఉన్నతంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో నేడు(శుక్రవారం) జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంపై ఆయన కీలక ప్రకటనలు చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు వచ్చిన సీఎం చంద్రబాబుకు అడవి బిడ్డలు ఘన స్వాగతం పలికారు. కొమ్ము, బంజారా, థింసా నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా సీఎం ఉత్సాహంగా డప్పు కొట్టారు. గిరిజన బాలికలతో కలిసి కాసేపు నృత్యం చేసి వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ అధికారులు పలు వివిధ ప్రైవేటు సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నారు. గిరిజన బిడ్డలు అడవిని అమ్మగా ఆరాధిస్తారు - అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేస్తారు: సీఎం చంద్రబాబు ముర్ము జీవితం ఆదర్శం : వేలాది ఏళ్లుగా ఆదివాసీలు తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్నారని సీఎం కొనియాడారు. ఓ సామాన్య కుటుంబంలో పుట్టి దేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు. అరకు కాఫీని ప్రభుత్వం ప్రోత్సహించి ప్రపంచస్థాయికి తీసుకెళ్తోందని చెప్పారు. పార్లమెంట్‌లోనూ అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయించామని గుర్తుచేశారు. దీని రుచి బాగుందని ప్రధాని మోదీ సైతం కితాబిచ్చారని, మన్‌కీ బాత్‌లోనూ ప్రస్తావించారని సీఎం తెలిపారు. అరకు కాఫీని అతి త్వరలో గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తామన్నారు. త్వరలో కొత్త విధానం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులకు న్యాయం చేసిన తొలి పార్టీ టీడీపీనే అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు ఆయా ప్రాంత గిరిజనులకే దక్కాలనే సదుద్దేశంతో 2000 సంవత్సరంలో తాము ‘జీవో నంబర్ 3‘ తీసుకొచ్చామన్నారు. అది దాదాపు 20 ఏళ్ల పాటు దిగ్విజయంగా అమల్లో ఉందన్నారు.

## అమెరికాలో డాక్టర్ రాజా కుమారుడి వివాహానికి హాజరైన మంత్రి నారా లోకేశ్



- అమెరికాలో జరిగిన వివాహ వేడుకకు మంత్రి నారా లోకేశ్ హాజరు
- గ్లోబల్ ఎన్నారై చీఫ్ డాక్టర్ రాజా కుమారుడి వివాహం
- తన అర్ధాంగి బ్రహ్మణితో కలిసి వేడుకలో పాల్గొన్న లోకేశ్
- నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్ దంపతులు

అమరావతి : ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, తన అర్ధాంగి నారా బ్రహ్మణితో కలిసి అమెరికాలో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరయ్యారు. గ్లోబల్ ఎన్నారై చీఫ్ డాక్టర్ రాజా కుమారుడి వివాహం అమెరికాలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి లోకేశ్ దంపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరుల వద్దకు వెళ్లి మంత్రి లోకేశ్, నారా బ్రహ్మణి వారిని మనసారా ఆశీర్వదించారు.

మొదటి పేజి తరువాయి

# గిరిజన బిడ్డలు అడవిని అమ్మగా ఆరాధిస్తారు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేస్తారు

అయితే, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 2020లో సుప్రీంకోర్టు ఆ జీవోను కొట్టివేసిందని తెలిపారు. సుప్రీంకోర్టులో గత ప్రభుత్వం సరైన వాదనలు వినిపించకపోవడం వల్లే గిరిజనులకు ఈ అన్యాయం జరిగిందన్నారు. గిరిజనుల హక్కుల కోసం తమ ప్రభుత్వం పోరాడుతుందని స్పష్టం చేశారు. గిరిజనులకు లబ్ధి చేకూరేలా త్వరలో అందరికీ ఆమోదయోగ్యమైన సరికొత్త విధానాన్ని తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. 2027 నాటికి అందరికీ ఇళ్లు : రాష్ట్రంలో మొత్తం 29 లక్షల మంది గిరిజనులు ఉన్నారని సీఎం తెలిపారు. వారి అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. 2027 డిసెంబరు నాటికి రాష్ట్రంలోని గిరిజనులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. అలాగే వారందరికీ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. 9 ఐటీడీఏ కేంద్రాల అభివృద్ధితో రానున్న రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. మారుమూల గిరిజన తండాల్లో టెలికాం కనెక్టివిటీ పెంచేందుకు టెలీకమ్యూనికేషన్స్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్ర' కలలు సాకారం అవుతాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన బిడ్డలు ఆవేశానికి లోనుకాకుండా, ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. దేశం మనకు ఏమి ఇచ్చిందనేది కాకుండా, దేశానికి మనం ఏం ఇస్తున్నామనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. అడవి బిడ్డలు బాగా చదువుకుని ఐఐటీల స్థాయికి వెళ్లగలిగితే దేశానికి ఎంతో ఉపయోగపడినట్లే అని చెప్పారు. తాను ప్రజాప్రతినిధిగా ఎన్నికైనప్పటి నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని గుర్తుచేశారు. ప్రజల జీవితాలను మార్చగలిగితే చాలు, అదే తనకు దక్కే అసలైన ఆనందమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. "దేశం మనకు ఏమిచ్చిందనేది కాకుండా దేశానికి మనం ఏం ఇస్తున్నామనే ఆలోచన ప్రతి ఒక్కరికీ రావాలి. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేయగల సామర్థ్యం ఆదివాసీలకు ఉంది. సామాన్య కుటుంబంలో పుట్టి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపది ముర్ము జీవితం అడవి బిడ్డలకు ఆదర్శం. గిరిజన బిడ్డలు బాగా చదువుకొని ఐఐటీలకు వెళ్లాలి. వికసిత్ భారత్‌లో అనుసంధానం కాగలిగితే ఆకాశమే హద్దుగా ఎదగవచ్చు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ వైఫల్యం వల్లే సుప్రీంకోర్టు జీవో నంబర్ 3ను కొట్టివేసింది. గిరిజనులకు లబ్ధి జరిగేలా మళ్లీ అందరికీ ఆమోదయోగ్యమైన కొత్త విధానం తీసుకొస్తాం."

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల భారీ రద్దీ

కిలోమీటర్ల మేర బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. నిన్న (ఆగస్టు 8) మొత్తం 87,658 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు 4.15 లక్షల లడ్డూలను విక్రయించగా, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. వారాంతం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగినట్లు తెలుస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తూ రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

# అమెరికాలో డాక్టర్ రాజా కుమారుడి వివాహానికి హాజరైన మంత్రి నారా లోకేశ్

వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో లోకేశ్ దంపతులు సంప్రదాయ దుస్తులలో కనిపించారు. కార్యక్రమానికి వచ్చిన పలువురితో వారు కాసేపు ముచ్చటించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ప్రియాంక ఘటనపై అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష.. కఠిన చర్యలకు ఆదేశం

విశాఖపట్నం, ఆగస్టు 9: వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన ఘటనపై జిల్లా ఎస్పీతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత.. కేసు దర్యాప్తు, తదుపరి చర్యలపై ఆరా తీస్తున్నారు. అలాగే ప్రియాంక తండ్రి వెంకటేష్‌తో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయనకు భరోసా ఇచ్చారు. ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీసులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నారని హోం మంత్రి స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు స్పందించారని, కేసులో ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని అనిత వెల్లడించారు. ఘటనపై దర్యాప్తును వేగవంతం చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని మరోసారి భరోసా ఇచ్చారు.


# ట్రంప్‌కు ఝలకిచ్చిన బెంజిమిన్ నెతన్యాహు

కాగా తాజాగా ఈ పాలసీని వ్యతిరేకిస్తూ నెతన్యాహూ బాంబు పేల్చారు. నెతన్యాహూ తన వ్యాఖ్యల్లో "15-సూత్రాల పత్రాన్ని ఇజ్రాయెల్ తిరస్కరిస్తుంది. హమాస్ నిజంగా నిరాయుధులయ్యే వరకు ఐడిఎఫ్ ఎలాంటి ఉపసంహరణ చేపట్టదు. మన బలగాలకు, మన పౌరులకు ఎదురయ్యే ముప్పులను అడ్డుకుంటూనే ఉంటుంది," అని ఇజ్రాయెల్ రక్షణ దళాలను ప్రస్తావిస్తూ నెతన్యాహు క్యాబినెట్ సమావేశంలో అన్నారు. దీంతో మరోసారి పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఇజ్రాయెల్ నిర్ణయంతో గాజాలో శాంతిని స్థాపించడానికి హమాస్‌ను నిరాయుధులను చేయడానికి జరుగుతున్న అంతర్జాతీయ ప్రయత్నాలు మళ్లీ నిలిచిపోయే ప్రమాదం ఉంది. హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచిపెట్టే వరకు ఇజ్రాయెల్ సైన్యం తమ ప్రస్తుత స్థానాల నుంచి వెనక్కి వెళ్లేది లేదని తేల్చిచెప్పడంతో.. గాజాలో సైనిక ఉద్రిక్తతలు దాదులు కొనసాగే అవకాశం ఉంది.

# పెద్ది సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకొని భావోద్వేగానికి గురైన కేసీఆర్ - రూ.2.25 కోట్ల సాయం అందజేత

చేసిన కేసీఆర్, పెద్ది సుదర్శన్‌రెడ్డితో తన అనుబంధం గుర్తుచేసుకొని కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. సుదర్శన్‌రెడ్డి ఉద్యమ ఘట్టాల ఫోటోలు చూస్తూ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారన్నారు. పెద్ది కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్న కేసీఆర్ , పార్టీ తరఫున రూ. 2.25 కోట్లు అందించారు. కేసీఆర్ రాక సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో నల్లబెల్లి గ్రామం జనసంద్రంగా మారింది. జోహార్ పెద్ది సుదర్శన్ రెడ్డి, జై కేసీఆర్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

# కోల్‌కతాలో తప్పిన భారీ ప్రమాదం.. లేజర్ లైట్ల ఎఫెక్ట్.. గాల్లోనే విమానం చక్కర్లు..!



విమానాశ్రయ రన్‌వేకు సుమారు 8 నాటికల్ మైళ్ల దూరంలో విమానం ఉన్నప్పుడు మధ్యమ్‌గ్రామ్-బరసాత్ దిశ నుంచి కాక్‌పిట్ వైపు లేజర్ లైటింగ్ పడినట్లు పైలట్ గమనించాడని సంబంధిత వర్గాలు తెలిపాయి.

### చివరికి సేఫ్ ల్యాండింగ్ :

లేజర్ నుంచి ఒక్కసారిగా వచ్చిన కాంతి కారణంగా పైలట్ క్షణకాలం పాటు అయోమయంగా అనిపించింది. దాంతో విమానం అనుకున్న సమయానికి ల్యాండ్ అవ్వలేకపోయింది. మరోసారి ల్యాండ్ చేసేందుకు ప్రయత్నించే ముందు గాలిలో చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. చివరకు రాత్రి సుమారు 11:25 గంటలకు విమానం సేఫ్ ల్యాండ్ అయింది. ప్రయాణీకులు, సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

### ఘటనపై పోలీసులకు ఫిర్యాదు :

ఈ ఘటన అనంతరం.. విమానయాన సంస్థ విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించింది. కోల్‌కతా విమానాశ్రయ యంత్రాంగం కూడా నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అంతర్జాతీయ విమానాశ్రయ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వర్గాలు చెబుతున్నాయి. విమానాశ్రయం పరిసరాల్లో లేజర్ లైట్ల వాడకం నిషేధించినట్లు కోల్‌కతా విమానాశ్రయ డైరెక్టర్ విక్రమ్ సింగ్ తెలిపారు. అయినప్పటికీ, ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతూ ఉంటాయని, విమాన కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని పోలీసు అధికారులకు రిపోర్టు చేశామని, దర్యాప్తు జరుగుతోందని ఆయన అన్నారు. టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో లేజర్ లైట్ల వల్ల ఆటంకం కలుగుతోందని పైలట్లు గతంలోనే ఫిర్యాదు చేశారు. 2025లో దుర్గా పూజ సందర్భంగా శ్రీభూమి స్పోర్టింగ్ క్లబ్ పూజా పండల్ సమీపంలో లేజర్ లైట్లపై పైలట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత, లేజర్ షోను నిలిపివేశారు.

# కుమురం భీమ్ ఆశయాల సాధనకు అందరూ ఐక్యంగా కృషి చేయాలి

మొదటి పేజి తరువాయి



పోరాడినటు వంటి కుమురం భీమ్ వరకు ఎంతో స్ఫూర్తి పొందామని చెప్పుకొచ్చారు. రాజ్యాంగంలో చూస్తే మనకు ప్రత్యేక స్వయం ప్రతిపత్తి, ప్రత్యేక భూ హక్కులు, ప్రత్యేక ఉద్యోగ, ఉపాధి హక్కులు ఉన్నాయని ప్రస్తావించారు. ఆనాడు అంబేద్కర్, నెహ్రూ ఇద్దరు కలిసి మన జాతికి స్వయం ప్రతిపత్తి ఉండాలని 5వ షెడ్యూల్ ఏరియా ఏర్పాటు చేశారని వివరించారు. మన ప్రాంతాలకు 6వ షెడ్యూల్ ప్రకారం.. ఈశాన్య రాష్ట్రాలకు మణిపూర్, అస్సాం, సిక్కిం అలాంటి రాష్ట్రంలో ప్రత్యేక ప్రతిపత్తిని కూడా ఇచ్చారని మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పుడు కూడా తమకు ఎవరితో శత్రుత్వం లేదని అన్నారు. ఈ జాతి సోదరులకు కూడా చెబుతున్నా ఏ కులాన్ని మనం ద్వేషించాల్సిన అవసరం లేదని చెప్పారు. ఏ ప్రాంత ప్రజలను వ్యతిరేకించాల్సిన అవసరం లేదని.. కానీ న్యాయంగా రావలసిన హక్కుల కోసం తాము అడుగుతామని అన్నారు. గిరిజనేతరుడైన నాయకుడు అల్లూరి సీతారామరాజు ఈరోజు అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంకా మన్యం బిడ్డలు పోరాడుతూనే ఉన్నారని చెప్పారు. ఎవరికీ తాము వ్యతిరేకం కాదని, ఎవరిని ఈ జాతి వ్యతిరేకించలేదని, ఎవరు వచ్చినా అక్కున చేర్చుకున్నామని వెల్లడించారు. ఇక్కడ ఉన్నటువంటి ప్రత్యేక అవకాశాలను కచ్చితంగా ఉపయోగించుకునే హక్కు రాజ్యాంగం ఇచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎప్పుడూ అడవి బిడ్డలు, పేదలు, బడుగు బలహీన వర్గాలంటే ప్రత్యేకమైన అభిమానమని చెప్పారు. దేశంలో ఎక్కడ జరగని కులగణనను చేశారని.. బీసీల కోసం కులగణన చేశారని మంత్రి సీతక్క ప్రస్తావించారు. దళితుల్లో ఉండే సమస్యను కూడా పరిష్కరించామని చెప్పారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి స్థాయిలో నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. భూముల సమస్యలు సహా గిరిజనుల సమస్యలను తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని వెల్లడించారు. ఏదైనా సమస్య పరిష్కారం కోసం పేదలు, నిరక్షరాస్యులు వస్తే వారిని అధికారులు నిర్లక్ష్యం చేయకుండా గౌరవంగా చూడాలని సూచించారు. ప్రజల వినతులను స్వీకరించి వారి కష్టాలకు పరిష్కరించాలని ఆదేశించారు. కుమురం భీమ్ పోరాట స్ఫూర్తితో గిరిజన హక్కుల సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మన భాష, వేషధారణ, సంస్కృతి గిరిజనుల అస్థిత్వం నిలుపుకోవడం మన బాధ్యత అని చెప్పారు. భవిష్యత్తు తరాలకు అందించాల్సిన గొప్ప ఆస్తి మన సంస్కృతి అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన!

మొదటి పేజి తరువాయి



హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

# చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం

మొదటి పేజి తరువాయి

భావితరాలకు స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలియజేయాలి: పెమ్మసా

కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. 'జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని నేను దర్శించుకుంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హేళన చేశారు. నేడు కేటీఆర్‌కు జ్ఞానోదయమైంది. అందుకే భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. బీఆర్ఎస్ పాలనలో లాల్ దర్వాజ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ. 20 కోట్లు ఇస్తానని కేసీఆర్ మోసం చేశారు. ప్రజలనే కాదు.. దేవుళ్లనూ మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌ది. అందుకే ఆ పార్టీని ప్రజలు ఓడించారు. లాల్ దర్వాజ బోనాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5.50 లక్షలు మాత్రమే ఇచ్చింది. లక్ష మంది భక్తులు దర్శించుకునే ఆలయానికి ఆ పైసలు ఏ మూలకు సరిపోతాయి?. రంజాన్‌కు రూ. 33 కోట్లు ఇచ్చి, 80 శాతం ఉన్న హిందువుల ఆలయాలకు రూ. 20 కోట్లు మాత్రమే ఇస్తారా?. ఒవైసీ బాధపడతారనే సింహవాహిని అమ్మవారి ఆలయ అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదు. పాతబస్తీలో పన్నులు కట్టేది హిందువులే. మా పైసలు మాకు ఇవ్వడానికి ఏం నొప్పి?. నేను ప్రశ్నిస్తే మతతత్వవాది అని ముద్ర వేస్తారా?, పాతబస్తీ బరాబర్ హిందువులదే. హిందూ సమాజాన్ని జాగృతం చేయడమే నాకు ముఖ్యం. నన్ను విమర్శించే నాయకులు ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. హిందువులారా.. అందరం సంఘటితమై కాంగ్రెస్, బీఆర్ఎస్ మెడలు వంచుదాం. జెన్-జీ తరం ఉద్యమ, ఆధ్యాత్మిక స్ఫూర్తిని హిందువులు అర్థం చేసుకోవాలి. జెన్-జీ లారా.. హిందూ సంఘటితం కోసం ఉద్యమించండి. బీజేపీ అధికారంలోకి వస్తే పాతబస్తీలో బోనాల ఉత్సవాలను సకల సౌకర్యాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. ఊహించని విధంగా నిధులను ఖర్చు చేస్తాం. భాగ్యలక్ష్మి అమ్మవారి



ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం. సనాతన ధర్మం కోసం పాటుపడే యువతరానికి శక్తిని ప్రసాదించాలని సింహవాహిని అమ్మవారిని వేడుకుంటున్నా' అని పేర్కొన్నారు.

# పోలీసుల ఎదుటే అసాంఘిక శక్తుల దాడి- నా ప్రాణాలే పోయేవి'- బీజేపీపై మమత ఫైర్

మొదటి పేజి తరువాయి



ప్రాణాలు కోల్పోయేవాళ్లం. ఇదంతా పోలీసుల సమక్షంలోనే జరిగింది. ఇలాంటి పరిస్థితిని నేను ఎప్పుడూ చూడలేదు. అసలు ఏం జరుగుతోంది? నన్ను లక్ష్యంగా చేసుకోవడానికి బీజేపీ ప్రభుత్వం గూండాలను వాడుకుంటోంది. వారికి పోలీసులు రక్షణ కల్పిస్తున్నారు." - మమతా బెనర్జీ, బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి

### ఇంతకీ ఏం జరిగింది?

టీఎంసీకి చెందిన కార్యకర్త బిర్జు కియోట్ . ఆయన కాంచరపారా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జెనీ శర్మ భర్త. దోపిడీ సహా పలు ఆరోపణలపై ఆయనను హాలిసహర్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఆయనను కోర్టులో హాజరుపరచగా, ఐదు రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగించారు. అయితే ఆయన కస్టడీలో ఉండగానే, అనారోగ్యానికి గురై చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. అయితే లాకప్ లో తన భర్తను తీవ్రంగా కొట్టారని, పోలీసుల దాడి కారణంగానే అయన మరణించారని భార్య జెనీ శర్మ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే మృతుడి కుటుంబాన్ని పరామర్శించడానికి మమత వెళ్లారు. అయితే బిజ్ పూర్ వద్ద నిరసనకారులు ఆమె కారును చుట్టుముట్టారు. ఆ సమయంలో కారులో మమతతో పాటు లోక్ సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా ఉన్నారు. అయితే నిరసనకారులు శాంతియుతంగా ఉన్న ఆ ప్రాంతంలో అశాంతిని సృష్టించేందుకే మమత వచ్చారని ఆరోపించారు. ఆమెకు వ్యతిరేకంగా దొంగ, దొంగల రాణి అంటూ నినాదాలు చేశారు. దీనితో ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ సువేందు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పోలీసులపై తనకు ప్రత్యేకంగా కోపం లేదని మమతా బెనర్జీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకే బలగాలు పనిచేస్తున్నాయని అన్నారు. "పోలీసులు గూండాలను కాపాడుతున్నారు. బంగాల్ గూండాల చేతుల్లోకి వెళ్లిపోయింది. దీనిపై మా పార్టీ చట్టపరంగా ముందుకు వెళ్తుంది" అని చెప్పారు.

### రెచ్చగొట్టడానికే మమత వచ్చారు!

మమతా బెనర్జీ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. ఉద్రిక్తతలను రేకెత్తించడానికి, ప్రజలను రెచ్చగొట్టడానికే మమతా బెనర్జీ కాంచరపారాకు వచ్చారని బీజేపీ ప్రత్యారోపణలు చేసింది. అందుకే ఆమె రాకను స్థానిక ప్రజలు వ్యతిరేకిస్తూ నిరసనలు చేశారని పేర్కొంది.

### పెరుగుతున్న రాజకీయ దాడులు!

బంగాల్‌లో అధికార, విపక్షాల మధ్య ఇటీవల కాలంలో రాజకీయ వేడి బాగా పెరిగిపోతోందన్న విషయాన్ని తాజా ఘటన మరోసారి నిరూపించింది. ఇటీవల మమత బెనర్జీ సహా, పలువురు టీఎంసీ నేతలు ఇలాగే నిరసనలు ఎదుర్కొన్నారు. జూన్‌లో కలకత్తా హైకోర్టు ప్రాంగణం నుంచి బయటకు వస్తుండగా, మమతను ఉద్దేశించి దొంగ, దొంగ అంటూ నినాదాలు చేశారు. అది జరిగిన రెండు నెలల తర్వాత తాజా ఘటన జరగడం గమనార్హం. మమత బెనర్జీ మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై కూడా జూన్‌లో దాడి జరిగింది. సోనార్‌పూర్ లో పర్యటిస్తున్న సమయంలో ఆయన కాన్వాయ్‌పై గుడ్లు విసిరి, టీఎంసీకి వ్యతిరేకంగా నినాదాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. టీఎంసీ అధికార ప్రతినిధి క్రిషను మిత్రా ఆ దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. మమతా బెనర్జీ వాహనంపై రాళ్లు, బురద విరసడాన్ని అత్యంత హేయమైన, ఖండించదగిన చర్యగా అభివర్ణించారు. పోలీస కస్టడీలో తమ కార్యకర్త మరణించాడనీ, ఇప్పుడు మమతపై దాడి చేశారని, దీనికి వ్యతిరేకంగా తమ పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు. సువేందు అధికారి పోలీసుల ద్వారా రాష్ట్రాన్ని నడుపుతున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం మాఫియాను వాడుకుంటున్నారని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఆరోపించారు. మమతా బెనర్జీకి చెందిన భద్రతా సిబ్బంది జోక్యం చేసుకోకపోతే, పరిస్థితి మరింత ప్రమాదంగా మారేదని అన్నారు.

# నేతన్నలకు పథకాలు రాకుండా చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కడుపు కొడుతోంది - కేటీఆర్

**ఎన్నికల్లో నేతన్నలకు ఇచ్చిన హామీ కూడా కాంగ్రెస్ నెరవేర్చలేదన్న కేటీఆర్ - నేతన్న బీమా, నేతన్న చేయూత పథకాలను నిలిపేసిందని విమర్శలు - పథకాలను పునరుద్ధరించి నేతన్నలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రికి లేఖ**

## నేతన్నల డిమాండ్ల కోసం సీఎం రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్ : నేతన్నలకు ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వారి కడుపు కొడుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఇవాళ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నేతన్నల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. నేతన్నల పథకాలను పునరుద్ధరించాలి : బీఆర్ఎస్ ప్రభుత్వ అధికారంలో ఉండగా కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి అనేక ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేశారని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. వాటిని నిలిపివేసి నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని ముఖ్యమంత్రిని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని ఆరోపించిన కేటీఆర్ వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి నేతన్నలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక భరోసా కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే : జాతీయ చేనేత దినోత్సవం కేవలం ఉత్సవాలు నిర్వహించుకునే రోజు కాదని, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేసిందన్నారు. 'నేతన్న బీమా' అమలు కావడం లేదని, 'నేతన్నకు చేయూత' పథకం చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయని తెలిపారు. కమిషన్ల కోసమే ప్రైవేట్ వ్యక్తులకు ఆర్డర్లు : చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపించారు. బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ప్రభుత్వ ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వ ఆర్డర్లు అన్ని కమిషన్ల కోసం ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. నేతన్నకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించిన ఆయన అడ్డగోలుగా హామీలు ఇచ్చి అందరిని మోసం చేసినట్లుగానే నేతన్నలను కూడా మోసం చేస్తోందని మండిపడ్డారు. నేతన్నలపై రెండు ప్రభుత్వాల తీరు ఒక్కటే : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కేటీఆర్ విమర్శించారు. పార్టీలు వేరైనా చేనేత విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిలో ఎలాంటి తేడా లేదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కలిసి చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని నేతన్నల కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చేనేత కళాకారుల కోసం ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, గతంలో రద్దు చేసిన అన్ని పథకాలను పునరుద్ధరించాలని కోరారు. హామీలను తక్షణమే అమలు చేయాలి : కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలను వెంటనే తిరిగి ప్రారంభించి బకాయిలు విడుదల చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేతన్న, చేనేత బతికితేనే మన సంస్కృతి, మన స్వాభిమానం సజీవంగా ఉంటాయన్నారు. ఇప్పటికైనా మోసపూరిత వైఖరి వీడి నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలని లేఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## ఎదులపాడ్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

### వేడమ రాముకు ఘన నివాళులు అర్పించిన ఆదివాసులు




తిర్యాణి, : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం ఎదులపాడ్ గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసులు ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సమాజానికి సేవలందించిన వేడమ రాము గారికి ఘనంగా నివాళులు అర్పించారు. వేడమ రాము చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, హక్కుల పరిరక్షణపై పలువురు మాట్లాడారు. ఆదివాసీల ఐక్యతను కాపాడుకుంటూ తమ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాడావి పార్వతి అంబరావు, తోటీ సంఘం జిల్లా అధ్యక్షులు ఆత్రం సంతోష్ కుమార్, రాయి సెంటర్ సర్మేడి మాడావి అంబరావు, వేడమ రాము వారసులు వేడమ వెంకటేష్తో పాటు గ్రామస్థులు జల్లు పటేల్, తిరుపతి, ఆత్రం భోజిరావు, మారుతి, శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. మహిళా సభ్యులు కౌసల్య, ప్రమీల, ఊర్మిళ, మోతుబాయి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సమాజం అభివృద్ధి, హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## గిన్నెదరిలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

### ఆదివాసి మహిళా సంఘం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన



తిర్యాణి, : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని గిన్నెదరి గ్రామపంచాయతీలో ఆదివాసి మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీల హక్కులు, గ్రామసభ ప్రాధాన్యత, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివాసీ ప్రాంతాల్లో గ్రామసభల పాత్ర, స్వయంపాలన హక్కులు, అటవీ భూములు, అటవీ వనరులపై హక్కుల గురించి కార్యక్రమంలో వివరించారు. ౹రాజుఉరా చట్టం షెడ్యూల్డ్ ఏరియాల్లో గ్రామసభకు స్వయంపాలనలో కీలకమైన అధికారాలను కల్పిస్తుందని, స్థానిక పాలనలో గ్రామసభ నిర్ణయాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అదేవిధంగా అటవీ హక్కుల చట్టం 2006 ద్వారా అర్హులైన అటవీ ప్రాంత ప్రజలకు భూమి, అటవీ వనరులపై చట్టబద్ధమైన హక్కులను గుర్తించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆదివాసీ సమాజం తమ హక్కులపై అవగాహన పెంచుకుని, గ్రామసభలను బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "౹రాజుఉరా చట్టం మన గ్రామానికి స్వయంపాలన హక్కు ఇస్తుంది. చట్టం మన అడవి, భూమి, జీవనాధారంపై చట్టబద్ధమైన హక్కు ఇస్తుంది. ఈ రెండు చట్టాలు ఆదివాసీల అస్తిత్వం, సంస్కృతి, గౌరవం, భవిష్యత్తును రక్షించే అత్యంత ముఖ్యమైన చట్టాలు. ప్రతి గ్రామసభ బలపడాలి.. ప్రతి అర్హ కుటుంబానికి అటవీ హక్కులు అందాలి" అని పేర్కొన్నారు. ఆదివాసీ మహిళలు, యువత గ్రామసభల్లో చురుకుగా పాల్గొని తమ హక్కుల పరిరక్షణకు ముందుకు రావాలని, భూమి, అడవి, సహజ వనరులతో పాటు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, సర్పంచ్ గుణవంత్‌రావ్, శంకరమ్మ, రాధ, రేణుక, ఆడతాను, సర్మేడి, మార్కెట్ కమిటీ నాయకులు రామచందర్, శోభన్ తదితరులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందారం ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీ



జైపూర్,: జైపూర్ మండల పరిధిలోని ఇందారం ఎక్స్ రోడ్ జంక్షన్ వద్ద జైపూర్ ఎస్ఐ భూమేష్ తమ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మార్గంలో రాకపోకలు సాగిస్తున్నపలు ద్విచక్ర వాహనాలు,కార్లు మరియు ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.వాహనాల నంబర్ ప్లేట్లు,సంబంధిత ధ్రువీకరణ పత్రాలు,డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భూమేష్ మాట్లాడుతూ...వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని,పరిమితికి మించి వేగంతో వెళ్లకూడదని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడిపినా,సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపినా చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ ధరించడం బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు.నేరాల నియంత్రణ మరియు ప్రజల భద్రత నిమిత్తమే ఈ తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్ఐ భూమేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## ఫ్రిజ్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం

### బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి



జైపూర్,: జైపూర్ మండలం శివ్వారం గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు ఫ్రిజ్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..శివ్వారం గ్రామానికి చెందిన రేగళ్ల బాపు ఇంట్లోని ఫ్రిజ్‌లో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాపించాయి.ఈ మంటలు పక్కనే ఉన్న రేగళ్ల బుచ్చమ్మ ఇంటికి కూడా వేగంగా అంటుకున్నాయి. మంటల తీవ్రతకు రెండు ఇళ్లలోని ధాన్యం,దుస్తులు,గృహోపకరణాలు మరియు విలువైన సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి.స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డామని బాధితులు కన్నీరుమున్నీ రవుతున్నారు. అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన బాధితులు రేగళ్ల బాపు,రేగళ్ల బుచ్చమ్మ కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆసిఫాబాద్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

### ఆదివాసీ వస్త్రధారణలో ఆకట్టుకున్న కలెక్టర్ కే. హరిత, ఎస్పీ నీతిక పంత్




ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ జిల్లాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కొమురంభీం విగ్రహానికి ఎమ్మెల్యే కోవా లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ కే. హరిత, ఎస్పీ నీతిక పంత్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి ఆదివాసీ కళాకారులు, విద్యార్థులు, యువతతో కలిసి భారీ ర్యాలీగా ఆదివాసీ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కే. హరిత, ఎస్పీ నీతిక పంత్ ఆదివాసీ సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఆదివాసీ భవన్‌లో జరిగిన సభలో ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ కే. హరిత, ఎస్పీ నీతిక పంత్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, భాషలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, పాటలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీ వస్త్రధారణలు, వాయిద్యాలు, నృత్యాలతో జిల్లా కేంద్రం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మద్దికల్ గ్రామం లో భూ లక్ష్మమ్మ పూజ కార్యక్రమం.



భీమారం,: భీమారం మండలం, మద్దికల్ గ్రామం లో సర్పంచ్ పోతెం సమయ్య ఆధ్వర్యంలో, ఉపసర్పంచ్ తేజస్విని రాజు,వార్డు సభ్యుల సమక్షంలో భూలక్ష్మమ్మ వారి పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొని భూలక్ష్మమ్మ ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు మరియు గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం జరగనున్న బోనాల పండుగ మహోత్సవం విజయవంతంగా జరగాలని, భూలక్ష్మమ్మ వారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించారు.

## షెడ్యూల్డ్ ప్రాంతాల హక్కుల పరిరక్షణకు పోరాడాలి

### సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండీ. చాంద్ పాషా



వాస్తవ గమ్యం : కాగజ్‌నగర్ మండలం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ మండలం దరిగాం గ్రామంతో పాటు పట్టణంలోని సిర్పూర్ చౌరస్తాలో వేడుకలు నిర్వహించారు. సిర్పూర్ చౌరస్తాలో కొమురంభీం విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కొమురంభీం జిల్లా కార్యదర్శి ఎండీ. చాంద్ పాషా మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ ప్రాంతాల హక్కుల పరిరక్షణకు ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఉద్యమాలను బలోపేతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు రత్నం పోషన్న, లచ్చన్న, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు బండారి తిరుపతి, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, దరిగాం పార్టీ నాయకులు మారు పటేల్, భీంరావ్ పటేల్, భూరయ్యతో పాటు ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

## మందమర్రి ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్ వ్యాపారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



మందమర్రి,: మందమర్రి పాత బస్టాండ్, మార్కెట్, సోమగూడెం ప్రాంతాలకు చెందిన ఎలక్ట్రికల్, ప్లంబింగ్, శానిటేషన్, హార్డ్‌వేర్, పెయింట్స్ వ్యాపారుల సమావేశం ఆదివారం మందమర్రి మార్కెట్‌లోని సింగరేణి ప్రొఫెషనల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి సంఘం తరపున సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడిత్యాల రామ్మోహన్, జనరల్ సెక్రటరీగా నేరడికొమ్ముల సంతోష్, ట్రెజరర్‌గా బెరి రవీందర్, వైస్ ప్రెసిడెంట్‌గా పాలకుర్తి నరేష్, జాయింట్ సెక్రటరీగా సామల వెంకటేష్ ఎన్నికయ్యారు. అలాగే ముఖ్య సలహాదారులుగా ముకేష్, పాము వెంకటేశ్వరావులను నియమించారు.మిగిలిన వ్యాపారులను కార్యవర్గ సభ్యులుగా అందరి సమ్మతితో ఎన్నుకున్నారు. వ్యాపారుల ఐక్యతతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

## జైనూర్ మండల కేంద్రంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

### అదివాసులతో కలిసి డెంస నృత్యం చేసినా డిఎస్పీ అశోక్




వాస్తవ గమ్యం : కొమురం భీం అసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు కసిపాటల్ గూడ నుంచి సంస్కృతి సంప్రదాయం తో డోలు వాయిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు జైనూర్ సిర్పూర్ లింగపూర్ మండల ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు మండలంలోని కుంరం భీమ్ చౌక్ వద్ద కొమురం భీం విగ్రహాన్నికి పూలమాల వేసినివాలి అర్పించారు కొమురం భీం వారసుడు కొమురం జంగు జిల్లా తుడుం దెబ్బ అధ్యక్షుడు గేడం గోపీచంద్ అనంతరం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్ యందు ఏర్పాటు చేసిన సభలో ముందుగా ఆదివాసీ ఉద్యమ నాయకుల చిత్రాలకు పుష్పంజిలి ఘటించారు ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ తమ ఉద్యమంలో ఎవరికి లోటు వచ్చిన అందరూ ఐక్యతతో ముందుకు సాగాలి ఈనాటి సభ ఇంత ఘనంగా నిర్వహించడానికి కారణం మా సమాజ పెద్దలు రాయ్ సెంటర్ సరమెడి లు అని కొనియాడారు అనంతరం అసిఫాబాద్ డిఎస్పీ మాట్లాడుతూ మీ సంప్రదాయం అందరికి ఆదర్శం మీ సంస్కృతి భావితరాలకు గుర్తింపుగా నిలవాలి నేటి సమాజంలో ఆదివాసీ యువత చదువులో ముందుకు రావాలి ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలి ప్రతి




ఒక్కరు చైతన్యం అయి అందరికి ఆదర్శంగా నిలివాలి అని సూచించారు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీస్కొరావలని తెల్పారు అనంతరం మార్కెట్ చైర్మన్ కె విశ్వనాథ్ మాట్లాడుతూ నేడు మా మూడు మండల ప్రజలు ఎంతో ఘనంగా ఆదివాసీ దినోత్సవం జరుపుకోవడం జరిగింది ప్రతి ఒక్క గ్రామం నుంచి ఆదివాసీ సమాజ పెద్దలు రావడం చాలా సంతోషకరమైన విషయం రెండు మూడు రోజుల నుంచి ఎంతో కష్టం చేసి నేటి సభను విజయవంతం చేశారు నేడు మీ అందరి ఆశీర్వాదంతో నేను మార్కెట్ చైర్మన్ అయ్యాను ఇలాగే మీ ఆశీర్వాదం ఉండాలని మీ అందరిని కోరుతున్నానుఅని అన్నారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ శాఖ వారికి ఆదివాసీ సమాజం తరుపున కృతజ్ఞతలు తెల్పారు సమాజ పెద్దలుశ్రీ సెంటర్ పెద్దలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తుడుం దెబ్బ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు

## ఢిల్లీలో ధర్నాకు సన్నాహక సమావేశం



ఆసిఫాబాద్ : కాగజ్‌నగర్ మండలం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి సంబంధించి కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని కిషోర్ బాబు ఫంక్షన్ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మోర్లే విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి వసంత్, నాందేవ్ హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు వాసు, గోపాల్, శ్రీనివాస్, హనుమంతు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాలి సంఘం ముఖ్య నాయకులు పాల్గొని ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కనగానపల్లి రమణ కుమార్




విజయవాడ, **(దిక్సూచి ప్రతినిధి) ఆగస్టు 09: :** విజయవాడలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నియామక ఉత్తర్వులు అందజేత జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఈరోజు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమం, హక్కులు, సమస్యలపై నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా కనగానపల్లి రమణ కుమార్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నరసింహరావు ఉత్తర్వులు జారీ చేశారు. నియామక ఉత్తర్వులను జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగలరావు యాదవ్ చేతుల మీదుగా రమణ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు సాయి, రాష్ట్ర యువజన అధ్యక్షుడు అనుదీప్‌తో పాటు పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లవేళలా బీసీ సోదరులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ప్రభుత్వం మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి బీసీ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. బీసీ వర్గాల హక్కులు, సంక్షేమం కోసం సంఘం చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని రమణ కుమార్ పేర్కొన్నారు.

## హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనండి

# దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

### హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చిన మోదీ- ఆగస్ట్ 9 నుంచి 17 వరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు- వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి మరింత ప్రత్యేకం

భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సిద్ధమవుతున్న వేళ దేశ ప్రజలంతా 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం పిలుపునిచ్చారు. మన త్రివర్ణ పతాకం దేశానికి గర్వకారణం మాత్రమే కాకుండా, దేశం కోసం ఎప్పటికప్పుడు అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అందించే శక్తి అని మోదీ అభివర్ణించారు. ఆదివారం రోజు సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందేశం ఇచ్చారు. హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌లో ఉత్సాహంగా పాల్గొని, వికసిత్ భారత్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలన్న సంకల్పానికి కట్టుబడి ఉండాలని ప్రజల్ని కోరారు. ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని అభ్యర్థించారు. ఇంకా ఈ ఏడాది హర్ ఘర్ తిరంగా ప్రచారానికి ఒక ప్రత్యేకత ఉందని మోదీ పేర్కొన్నారు. మన జాతీయ గేయం వందేమాతరం రూపకల్పన జరిగి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ వేడుకల్ని వందేమాతరానికి అంకితం ఇవ్వడం గర్వకారణమని వెల్లడించారు. 2022లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కింద ప్రారంభమైన హర్ ఘర్ తిరంగా ప్రచారం ఇప్పుడు కోట్లాది మంది పౌరులు స్వచ్ఛందంగా పాల్గొనే జాతీయ సంప్రదాయంగా మారింది. దీని ద్వారా ప్రజలకు త్రివర్ణ పతాకంతో వ్యక్తిగత అనుబంధాన్ని పెంచడం సహా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల్ని గుర్తు చేసుకోవడం, దేశభక్తి, జాతీయ ఐక్యతను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాలు. ఈసారి ఆగస్టు 6న హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌ను లాంఛ్ చేయగా ఆగస్ట్ 9 నుంచి 17 వరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### సెల్ఫీ విత్ తిరంగా, బైక్ ర్యాలీలు, ప్రత్యేక పోటీలు

ఇక 150 ఏళ్లగా 'వందేమాతరం' దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని, స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలిస్తోందని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ఇండిపెండెన్స్ డే సందర్భంగా అదే స్ఫూర్తి ప్రతి వీధిలో, ప్రతి ఇంటిలో ప్రతిధ్వనించేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇక్కడ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు ప్రజలు దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేలా ఈసారి క్యాంపెయిన్‌ను రూపొందించారు. దేశవ్యాప్తంగా తిరంగా యాత్రలు, తిరంగా ర్యాలీలు, తిరంగా కచేరీలు, బైక్, సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో త్రివర్ణ పతాక రంగులతో ప్రత్యేక అలంకరణలు, లైటింగ్ కార్యక్రమాలు, వినూత్న కాన్సర్ట్‌లు, రంగోలి పోటీలు కూడా ఏర్పాటు చేయనున్నారు. పౌరులు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దానితో సెల్ఫీ తీసుకొని ఆ ఫొటోను ఘ్రుతీస్త్రఘ్రుతీఅతీఖుఅస్త్రు.ఎశీఎ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని అధికారులు కోరారు.

### దేశవ్యాప్తంగా విస్తృతంగా తిరంగా యాత్రలు

హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఇప్పటికే దేశవ్యాప్తంగా జోరందుకుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పుదుచ్చేరిలో ఆదివారం రోజు ఈ హర్ ఘర్ తిరంగా యాత్రలో పాల్గొన్నారు. మురుగా థియేటర్ సిగ్నల్ వద్ద ఈ యాత్రను నిర్వహించగా భారీ సంఖ్యలో జనం భాగస్వాములయ్యారు. తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ఈ యాత్రకు హాజరయ్యారు. ఇక త్రివర్ణ పతాకం దేశ గర్వం, ఐక్యతకు ప్రతీక అన్నారు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్. ప్రధాని మోదీ నాయకత్వంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తిని మరింత పెంచుతోందని పేర్కొన్నారు. ప్రజలు ప్రతి ఇంట్లో, ప్రతి ఒక్కరి హృదయంలో త్రివర్ణ పతాకాన్ని భాగం చేయాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కోరారు. ఇక హర్ ఘర్ తిరంగా 2026ను దేశవ్యాప్తంగా దేశభక్తి పండగగా జరుపుకోవాలని మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు.

### 'డూ ఆర్ డై' పిలుపు స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపు

ఇంకా అండమాన్ నికోబార్ దీవుల నుంచి మణిపూర్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, సిక్కిం వరకు పలు ప్రాంతాల్లో ఆదివారం తిరంగా యాత్రలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. అండమాన్ రాజధాని శ్రీ విజయపురంలో భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ 'హర్ ఘర్ తిరంగా' ప్రచారం ప్రారంభించారు. ఆగస్టు క్రాంతి దివస్ సందర్భంగా ఫ్లాగ్ పాయింట్ వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. 1942 ఆగస్ట్ 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' పిలుపు దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. భారత్ ఎప్పుడూ శాంతిని కోరుకుంటుందని దేశ ప్రయోజనాలు, సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి డెహ్రాడూన్‌లోని గాంధీ పార్క్‌లో నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు వేలాది మందితో కలిసి తిరంగా యాత్ర నిర్వహించారు. జమ్మూకశ్మీర్ పుల్వామా జిల్లాలో కూడా నిర్వహించిన భారీ తిరంగా ర్యాలీలో వందలాదిగా విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. మణిపూర్ ఇంఫాల్‌లో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రలో సీఎం ఖేమ్‌చంద్ సింగ్, సిక్కిం గ్యాంగ్‌టక్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు డీఆర్ థాపా తిరంగా యాత్ర నిర్వహించారు. మొత్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం, దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యత, దేశభక్తి సందేశాన్ని విస్తృతంగా చాటుతోంది.

